
ప్రజాశక్తి
మంగళవారం 6 మే 2025 5 అనంతపురం





హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



- తాడిపత్రిలో కొనసాగుతున్న హై టెన్షన్
- ఆగని మాటల యుద్ధం
- వెళ్తానంటున్న పెద్దారెడ్డి
- అడ్డుకుని తీరుతానంటున్న ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీ ముఖ్య నేతల మధ్య మాటలతో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తూనే ఉంది. హైకోర్టు అనుమతితో తాడిపత్రిలో అడుగు పెడతానని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చెప్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాడిపత్రిలో అడుగుపెట్ట నివ్వబోనని జెసి ప్రభాకర్ రెడ్డి బాహాటంగానే హెచ్చరికలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాగిపత్రిలో ఎప్పడే ఏమి జరుగుతోందో అన్న టెన్షన్ అందరిలోనూ కన్పిస్తోంది.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టలేదు. ఇటీవల ఆయన్ను తాడిపత్రిలోకి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ కోర్టు అనుమతి మేరకు తాను తాడిపత్రిలోకి వెళ్తానంటూ పెద్దారెడ్డి ప్రకటించారు. అయితే గతంలో తాము అధికారంలో లేనప్పుడు పెద్దారెడ్డి తమపై దౌర్జన్యాలకు పాల్పడ్డారని మున్సిపల్ ఛైర్మన్ జెసి. ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారు. దీనికి ప్రతిగా తాము ఇప్పుడు ఆయన్ను రానివ్వకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. తమపై తప్పుడు కేసులు పెట్టి కుటుంబాన్ని తీవ్రమైన ఇబ్బందులకు గురి చేశారని జెసి చెప్తున్నారు .ఆనాడు తమకు కూడా కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. అయినా రానివ్వకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రయత్నించారని ఆరోపించారు. కాగా వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాత్రం తాను తాడిపత్రి వచ్చి తీరుతానని చెబుతున్నారు. ఆయన మూడు రోజుల్లో జిల్లా ఎస్పీని కలిసి హైకోర్టు ఉత్తర్వును అందజేసి తాడిపత్రికి వెళ్లే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు ఇచ్చే సమయాన్ని బట్టి ఈనెల 8 లేదా 9వ తేదీల్లో తేదీల్లో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్తారని ప్రచారం నడుస్తోంది.

గతంలో వారు... ఇప్పుడు వీరు..!

1980 దశకం నుంచి ఓటమన్నది ఎరగకుండా తాడిపత్రిలో జెసి కుటుంబం ఓటమన్నది ఎరగకుండా అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వచ్చింది. తొలిసారిగా 2019 ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి జెసి కుటుంబంపై విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి రాగానే జెసి కుటుంబంపై కేసుల పర్వం మొదలైంది. బిఎస్ త్రీ వాహనాల కొనుగోళ్లలో అవకతకులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో ప్రభాకర్ రెడ్డి ఆయన తనయుడు అస్మిత్ రెడ్డిలు జైలుకు వెళ్లి వచ్చారు. ఇదే సమయంలోనే జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికి కేతిరెడ్డి పెద్దారెడ్డి వెళ్లడం అప్పట్లో రాష్ట్ర స్థాయిలోనే పెద్ద దుమారం రేపింది. ఇక 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పెద్దారెడ్డి ఓటమి చెందారు. రాష్ట్రంలోనూ వైసిపి అధికారం కోల్పోయింది. తాడిపత్రి ఎమ్మెల్యేగా జెసి.అస్మిత్ రెడ్డి గెలుపొందారు. టిడిపి అధికారంలోకి రావడంతో జెసి.ప్రభాకర్ రెడ్డి పెద్దారెడ్డికి గట్టిగానే కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. పెద్దారెడ్డి హయాంలో జరిగిన అక్రమాలను వెలికి తీసే పని చేయడమే కాకుండా, ఆయన్ను తాడిపత్రిలో అడుగుపెట్టనివ్వనని సవాల్ విసిరుతున్నారు. ఇప్పటి వరకు అయితే పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టలేదు. ప్రస్తుతం హైకోర్టు తీర్పు నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యేగా తాను నియోజకవర్గంలో పర్యటిస్తానని చెప్తున్నారు. ఇలా ఇద్దరు నేతల మధ్య రాజకీయ వేడి ఒక రకంగా యుద్ధాన్ని తలపిస్తోంది. ఘర్షనలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి పోలీసులు అనుమతిస్తారా.. లేదా..? లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

ముఖ్యమంత్రి పర్యటనకు...

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ టౌన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరలో అనంతపురం జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉరవకొండ పట్టణం వద్దనున్న హంద్రీనీవా కాలువ నుంచి రాగులపాడు పంప్ హౌస్ వరకు హెచ్‌ఎన్‌ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌లు స్థానిక అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఉరవకొండ పట్టణం, చిన్నముష్టూరు గ్రామం వద్దనున్న హంద్రీనీవా ప్రధాన కాలువ వంతెన నుంచి కాలువ మీద లత్తవరం బ్రిడ్జి, పిసి.ప్యాపిలి, వజ్రకరూరు మండలంలోని రాగులపాడు పంప్ హౌస్ వరకు కాలువ వెడల్పు పనులను పరిశీలించారు. ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్, లత్తవరం గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు గురించి అధికారులతో కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కాలువ ద్వారా ఎన్ని చెరువులకు కాలువ ద్వారా నీరు అందిస్తున్నారు.. పంప్ హౌస్ లో ఎన్ని రోజులు నీటిని పంప్ చేస్తారన్న తెలుసుకున్నారు. అనంతరం రాగులపాడు వద్ద హెలిప్యాడ్, సభ నిర్వహించేందు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి స్థానిక అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్డీవో ఎస్ఆర్బీఎస్ శ్రీనివాస్, ఆర్అండ్‌బి ఎస్ఈ రాజగోపాల్, సిఐలు చిన్నగౌస్, మహానంది, రాజు, మస్తాన్, కెనాల్ ఇన్‌ఛార్జి డిఇ పివి.రమణ, తహశీల్దార్లు మహబూబ్ బాషా, ఎంపిడిఒ రవిప్రసాద్, జెఈలు సురేష్ నాయక్, భార్గవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పయ్యావుల సమీక్ష



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మ్యాప్ ద్వారా మంత్రి పయ్యావులకు వివరిస్తున్న కలెక్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో సోమవారం అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గహంలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌లతో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం చేపట్టే ఏర్పాట్లను మ్యాప్ ద్వారా మంత్రికి కలెక్టర్ వివరించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ఎక్కడ పరిశీలించాలి.. హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి.. సభ ఎక్కడ పెట్టాలి.. తదితర ఏర్పాట్ల వివరాలను మంత్రి ఆరా తీశారు. ఈ సమావేశంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ సిఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఆర్డీవో ఎస్ఆర్‌బిఎస్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖ అధికారులతో ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అడ్వాన్స్ సప్లిమెంటరీ థియారీ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 48 జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. జనరల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 16,423 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5278 మంది మొత్తం 21,701 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించి మొదటి సంవత్సరం 1,528 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం 1,056 మంది విద్యార్థులు కలుపుకుని మొత్తం 2,584 మంది హాజరవుతారన్నారు. ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు కొత్త ఊరు పరీక్ష కేంద్రంలో మాత్రమే ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, హెల్త్ సిబ్బందిని నియమించాలన్నారు. ఎండల నేపథ్యంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులందరికీ మంచినీరు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, ఆర్డీవో కేశవ నాయుడు, డివిఈవో, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజహితుడు సికె.నాగేంద్రబాబు

- ఆయన ఆశయాలను కొనసాగించడమే కర్తవ్యం
- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్
- నాగేంద్ర బాబుకు ఘన నివాళి



నాగేంద్ర బాబు కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుడిగా ఉంటూ సామాజిక స్పృహతో సమాజ మార్పునకు కృషి చేసిన సమాజహితుడు, ఆదర్శనీయమైన గొప్ప నాయకుడు సికె.నాగేంద్రబాబు అని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనంతపురం జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి సికె.నాగేంద్ర బాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన సంతాప సభను యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు, సిఐటియు, ఐద్వా, ప్రజా సంఘాల నేతలు హాజరై నాగేంద్ర బాబు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ నాగేంద్ర బాబు సామాజిక స్పృహ కలిగిన గొప్ప నాయుడు అన్నారు. ఉపాధ్యాయుడిగా విధులను నిర్వహిస్తూనే సమాజహితం కోసం పని చేశారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో యుటిఎఫ్ అనేక ఒడిదుడుకులు ఏర్పడినప్పుడు సంఘానికి అండగా నిలబడి సంఘాన్ని బలోపేతం చేయడంలో నాగేంద్రబాబు కృషి మరువలేనిదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఆయన మతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్ మాట్లాడుతూ నాగేంద్రబాబు సాక్షరతా ఉద్యమంలో గొప్పగా పని చేశారని గుర్తు చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను తయారు చేయడంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా మాట్లాడుతూ నాగేంద్రబాబు ఉపాధ్యాయుల ఉద్యమం కోసం నిస్వార్థంగా సేవ చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ నాగేంద్రబాబు ఆశయాలను కొనసాగిస్తూనే, ఉపాధ్యాయుల శ్రేయస్సే ధ్యేయంగా యుటిఎఫ్ పని చేస్తుందన్నారు. అనంతరం రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకం నుంచి నాగేంద్రబాబు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చెక్కును యుటిఎఫ్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్య సాయి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి అనిల్, యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి ప్రమీల, అర్జున్, అబ్దుల్ వహాబ్, శేఖర్, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిలర్లు ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు నాగేంద్ర, మహమ్మద్ జిలాన్, కోటేశ్వరప్ప, జిల్లా పూర్వపు అధ్యక్షులు ఇమామ్ సాబ్, ఐద్వా నాయకురాలు వి.సావిత్రి, డివైఎఫ్ఐ నాయకులు బాలకష్ణ, రమణారెడ్డి, జెవివి రామిరెడ్డి, తిరుపాల్, భాస్కర్, సిఐటియు నాయకులు వి.రామిరెడ్డి, నాగేంద్ర, బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి అతిథులు వీరే..!

ముఖ్య అతిథిగా కాన్పూర్ ఐఐటి రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్.మాధవ్
డా॥సత్యనారాయణకు జెఎన్‌టియు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవం ఈనెల 17న జరగనుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథి, గౌరవ డాక్టరేట్ అందుకోనున్న వారి పేర్లను నిర్ణయం చేస్తూ సోమవారం నాడు రాజభవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ హోదాలో వారిని అనంతపురం జెఎన్‌టియుకు ఆహ్వానిస్తూ ఆహ్వానం పంపారు. గౌరవడాక్టరేట్‌కు హైదరాబాద్ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ చావాను ఎంపిక చేశారు. ఐఐటీ (కాన్పూర్) నుంచి ఎమెరిటస్ ప్రొఫెసర్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్.మాధవ్‌ను జెఎన్‌టియు14వ స్నాతకోత్సవం ముఖ్య అతిథి, వక్తగా వ్యవహరించడానికి ఎంపిక చేశారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో స్నాతకోత్సవంలో పాల్గొనున్నారు.

అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జెసి శివ్‌నారాయణ్ శర్మ



గ్రీవెన్స్ సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై ఎలాంటి అలసత్వం చూపకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువుకట్ట వద్దనున్న శ్రీ అనంత షిర్డీ సాయి కళ్యాణ మండపంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్ఒ ఎ.మాలోల, ఆర్డీవో కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, సివిల్ సప్లైస్ డిఎం.రమేష్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి 506 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు అర్జీదారులకు ఎప్పటికప్పుడు నాణ్యతగా పరిష్కారం చూపాలన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై ఐవిఆర్ఎస్ సిస్టం ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాన్ని ప్రభుత్వం తెలుసుకుంటోందన్నారు. స్వీకరించిన అర్జీలకు సంబంధించిన రసీదులను అర్జీదారులకు అందివ్వడమే కాకుండా వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజు నాయుడుతో పాటు జిల్లా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందాలి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అర్హత ఉన్న ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అందాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులకు సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం అమలుపై సోమవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, మండల కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతు పట్టాదారు పాసు పుస్తకాలు ఎన్ని ఉన్నాయి.. ఎంతమందికి పిఎం కిసాన్ పథకం వస్తోంది.. ఎంత మందికి రాలేదన్న అంశాలపై ఆరాతీశారు. పిఎం కిసాన్ రైతులకు ఎందుకు అందలేదన్న వివరాలు కూడా అధికారుల వద్ద సమగ్రంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రికార్డుల్లో తప్పిదాలు ఉన్నాయని... వాటిని సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి మండల నాయకులు పాల్గొన్నారు.

'కిశోరి వికాసం'ను విజయవంతం చేయండి

ఆర్‌డిఒ వసంత్‌బాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



గోడపత్రికలను విడుదల చేస్తున్న ఆర్‌డిఒ వసంత్‌బాబు, అధికారులు

బాలికల అభ్యున్నతి లక్ష్యంగా వారి వికాసానికి తోడ్పడటంతోపాటు వేసవి సెలవులను ఉపయోగించుకునేలా నిర్వహిస్తున్న కిశోర వికాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌డిఒ వసంతబాబు కోరారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వార్డు, గ్రామ సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆశా, ఎఎన్ఎం, విఒ, అంగన్వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని 11 నుంచి 18ఏళ్లలోపు బాలికలను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సిడిపిఒ పద్మావతి, కళ్యాణదుర్గం లక్ష్మీప్రసన్న, కంబదూరు (ఇన్‌ఛార్జి) రాధా, డివిజినల్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, అనంతపురంలో కార్మికుల సంఖ్య పెంచాలని, అదనపు కార్మికులకు రూ.15 వేల వేతనంతోపాటు ఇపిఎఫ్, ఇపిస్ఐ కట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న మూడు సంవత్సరాల సరెండర్ లీవ్, ఇంక్రిమెంట్లు, డిఎలు అమలు చేయాలని, ఇంజినీరింగ్ సెక్షన్ విభాగంలో 2011వ సంవత్సరంలో 309 మందికి తొమ్మిది నెలల ఇపిఎఫ్ జమ చేయాలన్నారు. అనారోగ్యంతో మరణించిన కార్మికులకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని, 60ఏళ్ల రిటైర్మెంట్ పేరుతో తొలగిస్తున్న కార్మికులకు కుటుంబాలు ఉపాధి కల్పిస్తూ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా పెండింగ్లో ఉన్న జీవోలను అమలు చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 20న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రెగ్యులర్ కార్మికుల నగర అధ్యక్షుడు ఎల్.ముత్తురాజు, నగర కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, మహిళా కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, కమిటీ సభ్యులు ఆది, శ్రీనివాస్‌మూర్తి, బంగ్లా రాఘవేంద్రప్రసాద్, నాగేంద్ర, పెన్నా, కుమార్, చలపతి, పుల్లన్న, మీసాల నారాయణ, రవి, జయరాం, ముత్యాలమ్మ, మరియమ్మ, కృపమ్మ, మంజుల, అంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

365 రోజులూ పంటలు సాగు చేసేలా ప్రణాళికలు

స్టేట్ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ వి.లక్ష్మనాయక్

ప్రజాశక్తి-అనంతపురం



శిక్షణ ఇస్తున్న వి.లక్ష్మనాయక్

రాయలసీమ ప్రాంతంలోని మెట్ట భూభాగంలో ఏడాదిలో 365 రోజులూ రైతులు పంటలు సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని రైతు సాధికార సంస్థ స్టేట్ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ వి.లక్ష్మనాయక్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్స్‌కు తెలియజేశారు. సోమవారం నాడు అనంతపురం రైతు సాధికార సంస్థ కార్యాలయంలో రాయలసీమ పరిధిలోని డిపిఎంలు, సిబ్బందికి మూడు రోజుల ప్రాంతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కరువు జిల్లాలు అయినప్పటికీ ఇక్కడి రైతులు ద్వారా 365 రోజులు పంటలు సాగు చేసేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయాన్నారు. ప్రతి పంట సాగులో కూడా ఒకే రకమైన పంటలు పంటలు సాగు చేయకుండా కనీసం ఐదు రకాలు పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఇలా 365 రోజుల్లో 25 రకాల జీవ వైవిధ్య పంటలు సాగులోకి తీసుకురావొచ్చన్నారు. రబీ, ఖరీఫ్ సీజన్‌తో సమ్మర్ సీజన్ మార్చి, ఏప్రిల్, మేని కూడా ఒక సీజన్ కింద తీసుకోవాలన్నారు. ఈ మూడు సీజన్‌లో కూడా మల్టీ క్రాప్, ఇంటర్ క్రాప్, అసోసియేట్ క్రాప్ పద్ధతులు పాటిస్తే రైతులకు నష్టం రాదన్నారు. ఈ కార్యక్రంలో రాయలసీమ జిల్లాల డిపిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున



సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20 తేదీన దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఒకరోజు సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్స్ పోరాట శిల్లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాయదుర్గం ప్రధాన కార్యదర్శి రాము, కార్మికులు అశోక్, రాజు, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడాలని వినతి



ఎమ్మెల్యేకు పూలమొక్క అందజేస్తున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

50ఏళ్లుగా పేదలకు అండగా నిలిచి అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఆర్డీటీ సంస్థ అనేకమంది పేద, వెనుకబడిన వర్గాలకు ఆర్థికంగా, విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయ రంగాల్లో అనేక సేవలు అందిస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ రెన్యువల్ చేయకుండా అడ్డుకోవడం చాలా బాధాకరమన్నారు. కావున వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే రెన్యువల్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జిల్లా అధ్యక్షులు వసంతకుమార్, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షులు ఉద్దీప్‌సింహా, రూరల్ అధ్యక్షులు దొనస్వామి, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షులు చెన్నమల్లప్ప, మహిళ నాయకురాలు శశి, వికలాంగుల మద్దతుదారులు, మల్లికార్జున శంకర్, కళ్యాణదుర్గం రవి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



శింగనమలలో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-శింగనమల

భూసార పరీక్షలతో కలిగే లాభాలపై వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం మండల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష కేంద్రం అధికారి శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రతి మూడేళ్లకు ఒసారి భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. తద్వారా భూమిలోని పోషక విలువలు తెలుసుకోవడంతో ఏ పంటకు ఏమందులు వేయాలో తెలుస్తుందన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గి దిగుబడి, ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. అనంతరం భూసార పరీక్షల చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌కుమార్, ఎఇఒలు అక్కమ్మ, విశ్వేశ్వరి, పిఎసిఎస్ సిఇఒ నారాయణస్వామి, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని 1వ రైతు సేవాకేంద్రంలో భూసార పరీక్షలు, వాటి ఫలితాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా భూసార పరీక్ష కేంద్రం అధికారి ప్రతాప్ భూసార పరీక్షల వల్ల రైతులకు ఏ విధంగా లాభమో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి, రైతుసేవా సహకార సంఘం ప్రత్యేక అధికారి పుజన్ సీతవో, అధికారులు భవానీ ప్రసాద్‌రెడ్డి, శ్రీహరి, రామేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ పద్ధతిపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా పర్యాటక శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్‌ఎస్, సర్కిల్ అనంతపురం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మసినేని గ్రాండ్ హోటల్లో ఆదివారం స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ (ఎస్‌జిఎల్‌ఆర్) పద్ధతిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి జయకుమార్ బాబు మాట్లాడుతూ రాబోయే నెలలో నిర్వహించనున్న స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ ప్రక్రియ కోసం జిల్లా, డివిజనల్ స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లను పరిశీలించి శుభ్రత, పర్యావరణ అనుకూలత, నిలకడైన నిర్వహణ మొదలైన ప్రమాణాల ఆధారంగా వాటికి 1 లీఫ్ నుంచి 5 లీఫ్స్ వరకూ రేటింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. తద్వారా హోటల్ పరిశుభ్రతను ప్రోత్సహించడం, పర్యాటకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సురేష్, జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామచంద్రారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ చంద్రశేఖర్, డిఎల్‌డిఒలు విజయలక్ష్మి, లలితాబాయి, నాగేశ్వరరావు, అనంతపురం హోటళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు బండి రమణ, తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై ఉద్యోగులకు అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియ విభాగం కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన సమాచార హక్కు చట్టం-2005 పై ఉద్యోగులకు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా చట్టం లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ఆమోదం, గెజిట్ ప్రచురణ తదితర వివరాలను వివరించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం, అధికార యంత్రాంగాల అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు, పౌరులకున్న సమాచార హక్కును చట్టబద్ధం చేసినట్లు తెలిపారు. ఈ చట్టం ప్రకారం ప్రతి పౌరుడు చట్టానికి లోబడి తనకు కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చన్నారు. అనంతరం ఉద్యోగులు అడిగిన అనేక ప్రశ్నలకు సావధానంగా జవాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సూపరిటెండెంట్ శ్రీలత, జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



రాయదుర్గం తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎంయుఎ ప్రతినిధులు

రాయదుర్గం : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయదుర్గం డిపో కార్యదర్శి హెచ్.తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ ఉపాధ్యక్షులు షఫీ, రీజినల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి నాయక్, డిపో అధ్యక్ష కార్యదర్శులు జిలాన్, తిప్పేస్వామి, గ్యారేజ్ అధ్యక్షులు దూద్ పేరా,సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, ట్రెజరర్ యోగేంద్ర కుమార్, నాయక్, ఈశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, రామాంజి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాయికుమార్‌కు జాతీయ సేవారత్న పురస్కారం



సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయికి పురస్కారం అందజేస్తున్న మంత్రి పయ్యావుల

అనంతపురం : సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్‌ను జాతీయ సేవరత్న అవార్డు వరించింది. ఈమేరకు సోమవారం సున్యసే శిఖర్ ఫౌండేషన్ ముంబైవారు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ 1988లో భగవాన్ సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి దాదాపు 37 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. తమ సంస్థకు సహకరిస్తున్న దాతలు, అధికారులు, అనధికారులు, రాజకీయ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరి సంస్థ చంద్రకాంత్‌నాయుడు, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ్‌నాయక్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో అసంబద్ధాలను తొలగించాలి

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్లకు వినతులు



అనంతపురంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యావ్యవస్థలో నెలకొన్న అసంబద్ధాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపిటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల్లో తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా సోమవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన 117 జిఒతో కొన్ని సంవత్సరాలుగా విద్యా రంగ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో నెట్టివేయబడిందన్నారు. 117 జిఒ రద్దు అనే అజెండాతో ఎలక్షన్‌లో గెలుపొందిన టిడిపి కూటమి ప్రభుత్వం అశాస్త్రీయ అసంబద్ధమైన నిర్ణయాలతో విద్యా రంగాన్ని మరింత అతలాకుతలం చేసే విధంగా చర్యలు తీసుకుంటొందన్నారు. 12వ పిఆర్‌ని జూలై 2023 నుంచి అమలు చేయాల్సి ఉన్నా ఇప్పటికే ఆలస్యమైందన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని విడుదల చేయాలన్నారు. బకాయి పడ్డ మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సమాంతర బోధనా మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలన్నారు. పాఠశాల పూర్వపు స్వరూపాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలు, పిఆర్‌సి తక్షణమే ఇవ్వాలన్నారు. ఇదే డిమాండ్లతో జిల్లావ్యాప్తంగా 9న ధర్నా కార్యక్రమం ఉంటుందని, 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేవారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ సబ్ కమిటీ సభ్యులు సతీష్ కుమార్, నరేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, నాయకులు గురు రాజ్, ఓబులేసు, సూర్యనారాయణ, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం ప్రజాఉద్యమం

ఎఫ్‌సీఆర్‌ఎను రెన్యువల్ చేయాల్సిందే-వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



దీక్షల్లో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్డీటీకి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ (ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయకపోతే ప్రజా ఉద్యమం తథ్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ డిమాండ్ చేస్తూ అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అధ్యక్షతన సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వీరి దీక్షలకు అనంత వెంకటరామిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ అనేది స్వచ్ఛంద సంస్థ మాత్రమే కాదని, ఇక్కడి ప్రజల జీవితాల్లో భాగమన్నారు. వెనుకబడిన ఈ జిల్లాలో ప్రజల కష్టాలను గమనించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్డీటీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. ఆర్డీటీకి విదేశాల్లో ఉన్న ఎంతో మంది దాతలు ఆర్థికంగా చేయూత అందించారన్నారు. ఐదున్నర దశాబ్దాలుగా ఆర్డీటీ ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. అలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకపోవడంతో ఆర్డీటీ సేవలకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీని ఫలితంగా ప్రజలంతా ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలు చెప్పి కాలయాపన చేయకుండా తక్షణం ఆర్డీటీ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలని డిమాండ్ చేశారు.

90 శాతం సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేయాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోతున్న జిల్లా రైతులకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం మండల కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ 90శాతం సబ్సిడీతో వేరుశనగ పంపిణీ చేయాలని, ఖరీఫ్, రబీలో విత్తన ఏజెన్సీలకు బకాయిపడ్డ సబ్సిడీ డబ్బులు చెల్లించాలని, పత్తి, వరి, మొక్కజొన్న, తదితర విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతు సేవాకేంద్రాల ద్వారా సబ్సిడీతో ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, ఖరీఫ్ సీజన్‌కు ముందే సమగ్ర ఉచిత పంటల బీమా ప్రకటించి అమలు చేయాలని, నాసిరకం, కల్తీ విత్తనాలు అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి డి.శ్రీనివాసులు, మండల కమిటీ సభ్యులు టి.సంజీవరెడ్డి, వెంకటకొండ, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పుట్టపర్తి సత్యసాయి ధ్యాన మందిరంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు రాచర్ల ప్రణవసాయి, కాశంశెట్టి సుధీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.రాజశేఖర్, రాచర్ల నారాయణస్వామి, కెబిహెచ్ రాయుడు సహకారంతో ఛేంజ్ ఫర్ సొసైటీ టీం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో అనంతపురానికి చెందిన మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్.. 84988 11110,79953 09013 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అన్నదానం

యాడికి : మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. జానపాటి శ్రీనివాసులు (ప్రెస్), భార్య శ్రీదేవి పెళ్లిరోజును పురస్కరించుకుని ఆశ్రమంలోని నిరాశ్రయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్తెలు వర్షశ్రీ, త్రిషశ్రీ, కుమారుడు వెంకట సాయిమోక్షిత్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలని ధర్నా

నార్పల : మండల కేంద్రంలో తమకు ఉపాధి హామీ పనులు కల్పించాలని పలువురు ఉపాధి కూలీలు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా మండలంలో ఉపాధి హామీ పనులను సక్రమంగా కల్పించడం లేదన్నారు. పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ కూడా భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఇఒఆర్‌డి శైలజారాణి, ఎపిఒ రమేష్ రామారావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

కార్యకర్తకు పరామర్శ

శింగనమల : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మండలంలోని నాగులగుడ్డం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వెంకటరమణను సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ శ్రీరామిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



బాధితుడిని పరామర్శిస్తున్న శ్రీరామిరెడ్డి

'వికసిత్ భారత్'పై అవగాహన




సంచార జాతుల వారితో సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'వికసిత్ భారత్' కార్యక్రమం కింద అమలు చేస్తున్న విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, వృత్తి అభివృద్ధికి సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అనంతపురం గ్రామీణ మండలంలోని ఉప్పరపల్లి గ్రామం పరిసరాల్లో నివసిస్తున్న సంచార జాతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాలకు అనుకూలంగా శక్తివంతమైన సాధనాలను రూపొందించినటుల తెలిపారు. భవిష్యత్తులో మరింత ప్రభావవంతమైన చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.మునినారాయణప్ప, సహ సహాయ డైరెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పద్మావతి, నర్మద, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 472 మంది ఎంపిక

అనంతపురం : నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 472మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఈమేళాలో సుమారు 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని దాదాపు 800 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి 472 మందిని ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, ప్లేస్‌మెంట్ సెల్ సమన్వయకర్త తాళంకి జీవన్‌కుమార్, ఎస్‌విజిఎం కళాశాల ప్రిన్సిపాల్ శైలజారాణి, ప్రభుత్వ కళాశాల జెకెసి మెంటార్లు వెంకటేష్, స్వామి, ఎపిఎస్‌ఎస్‌డిసి నారాయణస్వామి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు, నిరుద్యోగులు

ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసిన మార్కెట్ యార్డు సభ్యులు

అనంతపురం రూరల్ : రాప్తాడు మార్కెట్ యార్డు నూతన కమిటీ సభ్యులు సోమవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులందరూ మార్కెట్ యార్డు అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.



మార్కెట్ యార్డు సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

బిఇడి పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌కెయు ఉపకులపతి అనిత

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బిఇడి కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని యునివర్సిటీ ఉపకులపతి బి.అనిత, బిఇడి కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. బిఇడి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తరగతి గదులను పరిశీలించి సౌకర్యాలపై ఆరాతీశారు. అదేవిధంగా కంప్యూటర్లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను అడిగి తెలుసుకున్నారు.

ఎడిసిసి, డిసిఎంఎస్ ఛైర్మన్లకు సన్మానం



కేశవరెడ్డి, నెట్టెం వెంకటేష్‌ను సన్మానిస్తున్న బుగ్గయ్య చౌదరి

అనంతపురం : ఎడిసిసి బ్యాంకు నూతన ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొనంకి గంగారామ్, జిల్లా టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాయదుర్గం : రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఇన్సానియత్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 40 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మహేష్, ఇన్సానియాత్ యూత్ కమిటీ సభ్యులు లుక్‌మన్, జమీర్, ఇమ్రాన్, నయాజ్ అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి పరామర్శ



బాధితుడికి పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జయరామ్‌రెడ్డిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోమటికుంట కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె చిన్నారెడ్డి, జైచంద్రారెడ్డి, తక్కల్లపల్లి గోపాల్‌రెడ్డి, ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాటర్‌ప్లాంట్ ప్రారంభం

శింగనమల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కమ్యూనిటీ సెంటర్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్‌ప్లాంట్, పేషెంట్ సిట్‌ఔట్ కుర్చీలు, డైనింగ్ కుర్చీలను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం ప్రారంభించనున్నట్లు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అర్చకులు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలిసిన సుప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సాకే రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ద్వారకానాథాచార్యులు, మయూరం బాలాజీ సిబ్బంది మారుతీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ఉరవకొండ : వజ్రకరూరు మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నరేష్‌కుమార్‌ను ఎంఆర్‌పిఎస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఎంఆర్‌సిఎస్ సీనియర్ నాయకులు కోనాపురం ఎర్రిస్వామి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నాగన్న, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు మండ్ల బెంజిమెన్, సుకుమార్, మండల సర్వేయర్ మంజుల, జెఎ కీర్తి, షాలిని, విఆర్‌ఎలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పోక్సో కేసు నమోదు

పుట్లూరు : మండల పరిధిలోని ఓ గ్రామంలో 14ఏళ్ల అమ్మాయిని అదే గ్రామానికి చెందిన వెంకటనారాయణ మానసికంగా వేధించిన కేసులో పోక్సో కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

గుత్తి : పట్టణంలోని గుంతకల్లు రోడ్డు లో ఉన్న ఎస్వీఎస్ వైన్స్ అనే మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుకాణ భవనం పైకప్పుకు దుండగులు కన్నం వేశారు. లోనికి చొరబడి సీసీ కెమెరాలు సంబంధించిన కేబుల్‌ను తొలగించారు. దుకాణంలో ఉన్న దాదాపు రూ.70 వేలు విలువచేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది జరిగిన చోరీ జరిగినట్లు గ్రహించి నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.సురేష్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న జగనన్న కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దవడుగూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన రమేష్ తన వదిన భీమక్క అనారోగ్యానికి గురి కావడంతో గుంతకల్లులో వైద్య పరీక్షల కోసం ద్విచక్ర వాహనంలో కలిసి వెళ్లారు. వైద్య చికిత్సల అనంతరం స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా గుత్తి నుంచి గుంతకల్లు వైపు వెళ్లే ఆటో ఢీకొంది. ప్రమాదంలో రమేష్, భీమక్క లు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దొంగను పట్టుకున్న గ్రామస్తులు

మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో సోమవారం పట్టపగలే ఓ ఇంటిలోకి దొంగ చొరబడ్డాడు. ఇది గమనించిన గ్రామస్తులు ఆ దొంగను పట్టుకొని బంధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై కె.సురేష్ సిబ్బంది గ్రామానికి చేరుకుని దొంగను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. తమ ఇంటిలోని బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదులో తెలిపారు.

20మందిపై కుక్క దాడి

పుట్లూరు : మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ పిచ్చి కుక్క ఇంటి బయట నిద్రిస్తున్న వారిపై దాడి చేసి గాయపరిచింది. బయట నిద్రిస్తున్న దాదాపు 20మందిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే తాడిపత్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కాదా రాత్రి కుక్క దాడి చేయడంతో స్థానికులు జాగారం చేయాల్సి వచ్చింది.